పది కిలోల గంజాయి పట్టివేత

ఆదిభట్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంజాయిని విక్రయిస్తుండగా ఒడిశాకు చెందిన అక్కాతమ్ముడు పట్టుబడిన ఘటన ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం అక్క దేబ కబాసి(35), తమ్ముడు జోగి మడకమి (42)లు ఇద్దరూ ఒడిశాలోని మల్కాన్‌గిరి తాలుకా గుర్ల గ్రామంలోని నూకరాజు అనే వ్యక్తి నుంచి 10కిలోల గంజాయిని రూ. 25000కు కొనుగోలు చేశారు. దానిని బొంగ్లూర్ సమీపంలోని కార్మికులకు, విద్యార్థులకు అమ్మడానికి యత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ ఇద్దరిని పట్టుకొని వారి నుంచి గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ రవికుమార్ తెలిపారు.

జనాభా నియంత్రణలో చైతన్యం

ఒకరిద్దరి పిల్లలకే ఆపరేషన్ చేయించుకుంటున్నారు

వాసెక్టమీకి పురుషులు జంకుతున్నారు
నా సర్వీసులో 35వేల ఆపరేషన్లు చేశా
జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రంగారెడ్డిఅర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఇప్పటివరకు నా సర్వీసులో 35వేల ఆపరేషన్లు చేశానని, డీఎంహెచ్‌వో అయ్యాక ఆపరేషన్లు మానేశానని, డీఐవోగా ఉన్నప్పుడు కూడా ఆపరేషన్లు చేశానని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

జనాభా నియంత్రణలో ప్రజల్లో చైతన్యం వచ్చింది. ఒకరిద్దరి పిల్లలకే ఆపరేషన్ చేయించుకుంటున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్(వాసెక్టమీ) చేయించుకునేందుకు పురుషులు వెనుకడుగు వేస్తున్నారు. అత్యధిక శాతం మహిళలే చేయించుకుంటున్నారు. ప్రతి ఏటా ఈ ఆపరేషన్లపై పురుషులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదు. వాసెక్టమీ కంటే ట్యూబెక్టమీ ఆపరేషన్లే అధికంగా జరుగుతున్నాయి. కుటుంబ నియంత్రణలో అనేక అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. కొత్త విధానాల వల్ల కోతలు లేకుండా కుట్ల సమస్యలు ఉండవని, రక్తస్రావం అయ్యే అవకాశం ఉంది. ట్యూబెక్టమీ కంటే వాసక్టమీ చాలా సులువు. జనాభా నియంత్రణకు ప్రభుత్వం ట్యూబెక్టమీ, వాసక్టమీతో పాటు డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపిక్ (డీపీఎల్) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతినెలా డీపీఎల్ క్యాంపులు నిర్వహించేది. ఇబ్రహీంపట్నం ఘటనతో ప్రభుత్వం వాటిని నిలిపివేసింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేస్తున్నాం

ప్రస్తుతం జోరుగా వానలు కురుస్తున్నాయి. ఈ సమయంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఏఎన్ఎంలు, ఆశాలు, ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పర్యటించారు. ప్రజారోగ్యానికి హానికరంగా మారిన హైరిస్క్ జోన్లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు తీసుకుంటున్నాం. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. జ్వర సర్వేను కూడా నిర్వహిస్తున్నాం. అన్ని ఆసుపత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతున్నాం. అన్నిరకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నాం. ఏఎన్ఎంలు, ఆశలు గ్రామాల్లో పర్యటించి డ్రైన్స్ అపరిశుభ్రత ప్రాంతాలను గుర్తిస్తున్నారు. ఈ నివేదికను పంచాయతీరాజ్ శాఖ అధికారులకు అందిస్తున్నాం. దోమలు గుడ్లు పెట్టే ప్రాంతాలను గుర్తించి తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతీ పీహెచ్‌సీకి కెమికల్స్‌ను అందించాం. డెంగీ కేసులు అధికంగా హైదరాబాద్‌లోనే ఉన్నాయి. మైగ్రేటెడ్ పాపులేషన్ ఎక్కువగా ఉంది. బతుకుదెరువు కోసం వచ్చిన వాళ్లే అధికంగా ఉన్నారు. పట్టణ ప్రాంతాలతో పోల్చుకుంటే గ్రామాల్లో డెంగీ కేసులు అతితక్కువగా నమోదవుతున్నాయి. ప్రస్తుతం డెంగీ మరణాలు ఎక్కడ కూడా నమోదు కాలేవు. డెంగీ వచ్చిన కొత్తలో మృతి చెందిన కేసులున్నాయి. డెంగీని అరికట్టే చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. పేషెంట్ కండిషన్ బట్టి ప్లాస్మా ఎక్కివ్వడం జరుగుతుంది. డిప్తీరియా సీజన్ ప్రారంభం అవుతుంది. కానీ మన ప్రాంతంలో ఈ వ్యాధి వచ్చే అకాశాలు లేవని ఆయన తెలిపారు.

చుక్క నీరు రాలే..!

జిల్లావ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురిశాయి. ఈసీ, మూసీ వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. జంట జలాశయాల్లో భారీగా వరద నీరు వచ్చి చేరింది. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. కానీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో అత్యల్పంగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు చేరలేదు. అవి ఎడారిని తలపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో జిల్లాలోనే అతితక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్ముందు వర్షాలు కురవకపోతే వ్యవసాయం మరింత సంక్షోభంలో పడే ప్రమాదముందని అన్నదాతలు వాపోతున్నారు.

చెదురు మదురు జల్లులతో అతితక్కువ వర్షపాతం
భారంగా వ్యవసాయం.. బోరుబావుల కిందే వరి సాగు
మున్ముందు పరిస్థితులపై ఆందోళనలో రైతన్నలు



నజ్దిక్‌సింగారం కుంట ఇలా..

ఇబ్రహీంపట్నం పరిధి చెరువులు, కుంటలు వెలవెల

జిల్లా వ్యాప్తంగా నమోదైన వర్షపాతం (మి.మీ.లలో..)

సంవత్సరం	సాధారణం	కురిసింది
2019-20	694.6	745.8
2020-21	694.6	1225.2
2021-22	694.6	953.5
2022-23	694.6	1120.3
2023-24	725.8	721.9
2024-25	725.8	916.9



చుక్క నీరు లేని నానక్‌నగర్ చెరువు

ఇబ్రహీంపట్నం/యాచారం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఈ ఏడాది చెదురుమదురు వర్షాలే కురవడంతో చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు రాలేదు. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసినప్పటికీ ఈ ప్రాంతంలో అత్యల్పంగా వానలు కురవడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరక వెలవెలబోతున్నాయి. దీంతో రైతులు బోరుబావుల కింద మాత్రమే వరి సాగు చేస్తున్నారు. ఈ నెలలో వర్షాలు కురవకపోతే వ్యవసాయాన్ని నమ్ముకోవడం కష్టమేనని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

మూడేళ్ల క్రితం...

2022 సంవత్సరం సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు అలుగు పారాయి. అక్కడక్కడ చెరువులకు గండ్లు కూడా పడ్డాయి. ఆ తర్వాత పెద్దగా వర్షాలు కురిసిన దాఖలాలు లేవు. 45ఏళ్ల సుదీర్ఘకాలం తర్వాత ఇబ్రహీంపట్నం చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారింది. ఈ చెరువుకు నీరొచ్చే ప్రధాన కాలువ అయిన పెద్ద కాలువను పునరుద్ధరించడంతోపాటు ఈ కాలువపై తిమ్మాపూర్, ఎలిమినేడు, పోచారంల వద్ద చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టడం ద్వారా వర్షపు నీరు సాఫీగా చెరువుకు రావడానికి మార్గం సుగమమైంది. చెరువు కింద ఆయకట్టుకు నీరు వదలకుండా నిల్వ చేయడంతో మూడేళ్లుగా భూగర్భజలాలు పెరిగి పంటల సాగు పెరిగింది. మత్స్యకారులు చేపలు పట్టుకొని జీవనోపాధి పొందారు. ఇప్పటికీ ఇబ్రహీంపట్నంలో పెద్దచెరువులో 19 అడుగుల మేర నీటి మట్టం ఉంది. అయితే ఈ ఏడాది భారీ వర్షాలు కురవకపోవడంతో మిగతా గ్రామాల్లో

మిగతా 8వ పేజీలో...

చెరువులు నిండలేదు.. ఎలా బతకాలి



ఆకులమైలారం చెరువు నిండితేనే మాకు బతుకుదెరువు. మూడేళ్లుగా అది నిండకపోవడంతో వరి సాగు చేయలేకపోతున్న. కనీసం ఆకుకూరలు సాగు చేద్దామన్నా బోరు నుంచి నీరు రావడం లేదు. ఇదే విషయం ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నగరంలో నాకు సన్మానం చేసిన సమయంలో ప్రస్తావించాను. నాగార్జునసాగర్ నుంచి నీరు మళ్లించి ఈ ప్రాంతంలో చెరువులు నింపాలని కోరాను. ఇదే

- రాములు, రైతు, చౌదర్‌పల్లి

స్వర్ణగిరి ఆలయాన్ని తలపించేలా...



పద్మనాభస్వామి ఆకారంలో వినాయకుడు, మండపం మధ్యలో పద్మనాభస్వామి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో వేంకటేశ్వర థియేటర్ స్థలంలో నెలకొల్పిన స్వర్ణగిరి వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. స్వర్ణగిరి ఆలయాన్ని తలపించేలా 40 ఫీట్ల ఎత్తులో రాజగోపురం, గోపురంపై విగ్రహాలు, ఎదుట ధ్వజస్తంభం, రెండు వైపులా గజ ఏనుగులతో అంబారీలు, గరుత్మంతుడు, ఆంజనేయస్వామి ప్రతిమలను ఏర్పాటు చేశారు. ముఖద్వారంపై వెంకటేశ్వరస్వామి ప్రతిమను నెలకొల్పారు. మండపంలో ఒకవైపు అష్టలక్ష్మీ అవతారాలు, మరోవైపు అష్ట గణపతుల అవతారాలు, మధ్యలో నీటి కొలను.. అందులో పవలించిన పద్మనాభస్వామి ప్రతిమను ఏర్పాటు చేశారు. ఎనిమిది తలలతో పడగవిప్పిన నాగరాజుపై పద్మనాభస్వామి ఆకారంలో వినాయకుడిని నెలకొల్పారు. శ్రీ అయ్యప్ప క్రియేషన్ యజమాని వినోద్ రెండు నెలల పాటు శ్రమించి స్వర్ణగిరి దేవాలయాన్ని తలపించే విధంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని తిలకించడానికి నిత్యం వేలాదిగా భక్తులు తరలిస్తున్నారు. భక్తులకు స్థల యజమాని గజవాడ వెంకటేశ్వర్‌రావు, వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు పి. సాయిప్రకాష్‌రెడ్డి మిత్ర బృందం సౌకర్యాలను కల్పిస్తున్నారు.

ఓటరు తుది జాబితాలో తప్పులుండొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు తుది జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, వార్డుల వారీగా ఓటరు లిస్టును పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే వెంటనే పరిష్కరించాలని, ముఖ్యంగా నకిలీ ఓటర్లు ఎక్కువగా ఉన్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, వారిని తొలగించి పకడ్బందీగా తుది జాబితాను రూపొందించాలన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో జాప్యం జరగొద్దని, పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఎక్కడైనా శిథిలావస్థలో భవనాలు ఉంటే గుర్తించి మరోచోటకు తరలించాలని, పోలింగ్ స్టేషన్ దూరంగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తే సమీప ప్రాంతంలో అదనంగా మరో స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. హాస్టల్స్ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. డీపీవో సురేష్ మోహన్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రజావాణికి 53 ఫిర్యాదులు

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో

మిగతా 8వ పేజీలో...

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి: కలెక్టర్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో జరిగిన అండర్ 17 ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి ఓవర్ ఆల్ చాంపియన్ సాధించిన రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం వాసవి జూనియర్ అండ్ ఒకేషనల్ కళాశాల క్రీడాకారులను ఆయన బంగారు పతకాలతో సన్మానించారు. కార్యక్రమంలో వాసవి విద్య సంస్థల చైర్మన్ మాదారం రమేష్, సీనియర్ అధ్యాపకుడు సుధాకర్, సురేష్, తెలంగాణ ఫుట్‌బాల్ కోఆర్డినేటర్ రహమత్, క్రీడాకారులు ఆర్ కిరణ్, రాజేష్, మహేష్, చరణ్ రిజ్వాన్ ధ్రువ చరణ్, అబ్దుల్ రహేమాన్, చంద్రశేఖర్, జావిద్, రామ్‌చరణ్ పాల్గొన్నారు.



సంచార చేపల విక్రయ వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

» మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

తలకొండపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, పశుసంవర్ధక, క్రీడల, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరిలు అన్నారు. పేదలు, కులవృత్తుల వారు ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని వారు పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామానికి చెందిన వరలక్ష్మికి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన సంచాల చేపల విక్రయ వాహనాన్ని సోమవారం సెర్ప్ సీఈవోతో కలిసి మంత్రులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రామస్వామి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం కన్నెర్ర

రోడ్డెక్కి రైతన్నల ఆందోళనలు
కేశంపేటలో పీఏసీఎస్ చైర్మన్ దిగ్బంధం



షాబాద్‌లో యూరియా కోసం బారులు, (ఇన్‌సెట్‌లో) కేశంపేటలో యూరియా కోసం సింగిల్ విండో చైర్మన్‌ను దిగ్బంధించిన రైతులు

కేశంపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా యూరియా లభించక రైతన్నలు రోడ్డెక్కారు. గంటలతరబడి క్యూలో నిల్చుంటే రెండే బస్తాలు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేశంపేట మండల కేంద్రంలో సరిపడా యూరియా ఇవ్వకపోవడంపై అన్నదాతలు కన్నెర్ర చేశారు. సోమవారం ఉదయం యూరియా బస్తాల స్లిప్‌ల కోసం కేశంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. యూరియా తక్కువగా ఉండటం, రైతులు ఎక్కువగా రావడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రైతుల వద్దకు వచ్చిన సింగిల్‌విండో చైర్మన్ గండ్రా జగదీశ్వర్ గౌడ్‌ను చుట్టుముట్టారు. మండల వ్యవసాయాధికారి శిరీష అక్కడికి చేరుకొని రైతులందరికీ యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. ఉదయం నుంచి క్యూలో నిల్చున్నా యూరియా ఇవ్వకపోవడంపై మహిళా రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితిని గ్రహించిన ఏవో శిరీష జిల్లా వ్యవసాయాధికారికి ఫోన్ ద్వారా సమాచారాన్ని తెలియజేశారు. త్వరలో మండలానికి

మిగతా 8వ పేజీలో...



మైసమ్మ దేవతకు స్పీకర్ పూజలు

మైసిగండి ఆలయంలో స్పీకర్ పూజలు

కడ్తాల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సందర్శించారు. సోమవారం మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిసారిగా ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ శిరోలి పంతు, ఈవో స్నేహలత, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు, భక్తులకు సదుపాయాల కల్పనకు ప్రభుత్వపరంగా తోడ్పాటు అందేలా చూడాలని శిరోలి పంతు ఈ సందర్భంగా స్పీకర్‌ను కోరారు. కార్యక్రమంలో యాదగిరి, చంద్రయ్య, కృష్ణ, భాను, అరుణ్, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు చేపట్టండి
పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి
6

సరిపడా యూరియా సరఫరా చేయాలి


మండల పరిషత్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులు వేసిన పంటలకు సరిపడా ప్రభుత్వం యూరియా సరఫరా చేయాలని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభులింగం డిమాండ్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ వద్ద ధర్నా నిర్వహించి ప్రజావాణిలో ఆర్డీవో అనంతరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. వరి నాట్లు వేసిన నెల రోజుల్లోపే యూరియా చల్లాల్సి ఉండగా సరఫరా లేక దుకాణాలు, ప్యాక్స్‌ల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని, ఇంతటి దౌర్భాగ్యం మరోటి లేదన్నారు. డీలర్లు యూరియాను బ్లాక్ మార్కెట్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ సమస్యను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల వరకు రుణ మాఫీకాని రైతులకు వెంటనే మాఫీ చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోచమోని నీలమ్మ, ఇబ్రహీంపట్నం, బాలాపూర్ మండల సీపీఐ కార్యదర్శులు కావలి సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహ, విజయ్‌కుమార్‌పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించని ప్రభుత్వాలు

షాబాద్: రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వాలు విఫలమైయ్యాయని సీపీఐ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం లేక యూరియా కష్టాలు తీవ్రమైయ్యాయని, రోజూ యూరియా కోసం రైతులు క్యూలో నిల్చుంటున్నా దొరకని పరిస్థితి ఉందన్నారు. సింగిల్ విండో, వ్యవసాయశాఖ అధికారులు సమస్య పరిష్కారానికి దృషిసారించాలన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పేదల ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ పాలన

ఆమనగల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాభీష్టానికనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో సోమవారం ఆయన పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని, ఆ పార్టీ పాలనలో ప్రతీ కుటుంబానికి మేలు జరుగుతుందని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలని, అలా అయితే అభివృద్ధి మరింత వేగిరం అవుతుందని కసిరెడ్డి అన్నారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి భూములు లాక్కోవద్దని తలకొండపల్లి మండలం ఖానాపూర్, మెదక్‌పల్లి, రాంపూర్, వెంకట్రావ్‌పేట గ్రామాల రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమాల్లో భట్టు కిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, సుమన్, అనంతరెడ్డి, రమణారెడ్డి, గుర్రం కేశవులు, భాస్కర్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, రవీందర్, బొజ్జ సాయిరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు చేపట్టండి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): 20ఏళ్లుగా హామీలకే పరిమితమైన లక్ష్మీదేవిపల్లిరిజర్వాయర్ పనులపై హామీలిస్తూ పోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పనులను చేపట్టాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పెన్షనర్స్ భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లవుతున్నా పనులు చేపట్టడం లేదన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపడతామని ఎన్నికల్లో నాయకులు హామీ ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం ప్రకారం షాద్‌నగర్ నియోజకవర్గాన్ని రంగారెడ్డి జిల్లాలో విలీనం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కొనసాగించారన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్, చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టులను నిర్మిస్తామన్న కాంగ్రెస్ పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. నిధులు కేటాయించి, నిర్మాణం చేపట్టేలా షాద్‌నగర్, పరిగి ఎమ్మెల్యేలు శంకర్, రామ్మోహన్‌రెడ్డిలు కృషిచేయాలని రాఘవచారి కోరారు. సమావేశంలో సంఘం నాయకులు కె.రవీంద్రనాథ్, ఎం.నర్సింహులు, వి.రామారావు, తిరుమలయ్య, అర్జునప్ప, జైపాల్‌రెడ్డి, ఖాజా షబ్బీర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాఘవాచారి


ప్రీతమ్‌ను సన్మానిస్తున్న శంకర్, అశోక్, భాస్కర్‌రెడ్డి

అభివృద్ధే కాంగ్రెస్‌ను గెలిపిస్తుంది

కడ్తాల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మరో ఘన విజయాన్ని సొంతం చేసుకుంటుందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ అన్నారు. కడ్తాలలో సోమవారం ప్రీతమ్ స్థానిక నేతలతో సమావేశమయ్యారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీల శ్రేయస్సు కోసం స్థానిక సీట్లలో 42శాతం రిజర్వేషన్ల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుంటే బీజేపీ, బీఆర్ఎస్‌లు అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో శంకర్, అశోక్, రామకృష్ణ, చందోజీ, లక్‌పతినాయక్, జహంగీర్ అలీ, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఆపడం లేదని విద్యార్థుల ధర్నా

బషీరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బస్సులను ఆపడంలేదని కొర్విచెడ్ గ్రామ విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం ఆర్టీసీ బస్సును అడ్డుకుని ధర్నాకు దిగారు. కొర్విచెడ్ వద్ద రిక్వెస్ట్ స్టాప్‌లో ఏళ్లుగా బస్సులను నిలిపేవారని, ప్రస్తుతం ఎందుకు ఆపడం లేదని డ్రైవర్‌పై మండిపడ్డారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న యూత్ ప్రభంజనం వ్యవస్థాపకుడు శ్రీనివాస్ ఆర్టీసీ డ్రైవర్‌తో మట్లాడారు. ఈ విషయమై ఎమ్మెల్యే పీఏ బషీరాబాద్ ఎస్ఐ నుమాన్‌అలీకి శ్రీనివాస్ సమాచారం అందించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశాలతో పీఏ ఆర్టీసీ అధికారితో మట్లాడి బస్సు ఆపేందుకు చర్యలు తీసుకోవడంతో విద్యార్థులు ధర్నాను విరమించారు.


కొర్విచెడ్ వద్ద ధర్నాకు దిగిన విద్యార్థులు, తల్లిదండ్రులు


అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

శ్మశానవాటికకు భూమి కేటాయించొద్దు

కొత్తూర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొడిచర్లతండాలో సర్వే నంబర్ 198లోని ప్రభుత్వ భూమిని క్రిష్టియన్ శ్మశానవాటికకు కేటాయించొద్దని మాజీ ఎంపీటీసీ బి.రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంతోష్‌నాయక్‌ల ఆధ్వర్యంలో గ్రామస్తులు అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. క్రిష్టియన్ శ్మశానవాటికకు భూమి కేటాయించేలా రెవెన్యూ అధికారులు సర్వేచేస్తున్నారని తెలిపారు. కొడిచర్లతండాకు పంచాయతీ భవనం లేక ప్రజలు ఇబ్బందులకు పడుతున్నారని, ఇదే భూమిలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించాలని కోరారు. ఇందుకు అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. బిచ్యానాయక్, వెంకటయ్య, దేవేందర్, శంకర్‌నాయక్, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండలంలోని సిరిపూరం గ్రామానికి చెందిన గడిల సుమిత్ర సోమవారం అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రభుత్వం ద్వారా ఆమెకు మంజూరైన రూ.5లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. వికారాబాద్ నియోజకవర్గ ప్రజలను ఆదుకునేందుకు ఎల్లవేళలా ముందుంటానని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో సీఎంఆర్ఎఫ్ సహాయనిధి చెక్కులను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాములుయాదవ్, రఘుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న ప్రసాద్‌కుమార్

ప్రసాద్‌ను కలిసిన నాయకులు

ఆమనగల్లు : రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సోమవారం ఆమనగల్లు మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కొండారెడ్డిపల్లిలోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో సీఎం సోదరుడు కృష్ణారెడ్డితో ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కల్వకుర్తి అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తోడ్పాటునందించాలని కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో రూపం వెంకట్‌రెడ్డి, భాస్కర్, కుమార్‌గౌడ్ ఉన్నారు.

మాట నిలుపుకున్న కాంగ్రెస్

» డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించన సందర్భంగా సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పక్షపాత ధోరణిని అవలంబిస్తున్నాయన్నారు. బీజేపీ కేంద్రంలో వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో సమర్థిస్తూ రెండు నాలుకల ధోరణిని అవలంబిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో నేడు రాష్ట్రంలోని బీసీలకు రిజర్వేషన్ కల్పించడం హర్షణీయమన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం మాట్లాడుతూ బీజేపీ కుల, మత రాజకీయాలతో సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శశికళ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, వజ్రేశ్ యాదవ్, మహిపాల్ రెడ్డి , నర్సింహులు యాదవ్, శంకర్ ముదిరాజ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మణికంఠ గౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి


మహాసభలో అభివాదం చేస్తున్న నాయకులు

సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమించాలి

కడ్తాల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు కార్మికులు ఉద్యమించాలని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. కడ్తాలలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల భవన నిర్మాణ కార్మికుల మహాసభ నిర్వహించారు. మండల అధ్యక్షుడు పెంటయ్య అధ్యక్షత వహించారు. రామ్మోహన్‌రావు, సీఐటీయూ జిల్లా నాయకుడు జగన్, సంఘం నాయకులు పార్వతి, జహంగీర్ హాజరయ్యారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. వెల్ఫేర్ బోర్డును ప్రైవేట్‌కు అప్పజెప్పే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని అన్నారు. కార్మిక హక్కుల కోసం పోరాటాలు సాగిస్తామని పేర్కొన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెంటయ్య, ప్రధానకార్యదర్శి మహేశ్,ఉపాధ్యక్షులు బాల్‌రాజ్, కొండల్, సత్యంగౌడ్, కార్యదర్శులు అర్జున్, సిలారి, జంగయ్య, కోశాధికారి యాదగిరి, సభ్యులుగా వీరేశ్, జంగయ్య, అంజయ్య, సత్యం, మహేశ్, కృష్ణయ్య, మల్లేశ్, దుర్గయ్య, శివయ్య, జంగయ్య ఎన్నికయ్యారు.



విద్యార్థులకు డిక్షనరీలు అందజేస్తున్న భట్టు కిషన్ రెడ్డి

విద్యతోనే ఉన్నత జీవితం

ఆమనగల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత జీవితం, సమాజంలో గౌరవం లభిస్తాయని ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి అన్నారు. కలకొండ జెడ్పీ పాఠశాల విద్యార్థులకు పులి కృష్ణ సొంత డబ్బులతో ఇంగ్లీష్ క్లాసులు ఆన్‌లైన్‌లో బోధిస్తున్నాడు. కృష్ణ సమకూర్చిన డిక్షనరీలను సోమవారం కిషన్‌రెడ్డి అందజేసి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, ఓంప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీనర్సింహా రెడ్డి, యాదయ్య, రాములు, జైపాల్, సతీష్, సందీప్‌రెడ్డి, కొండల్, శ్రీను, మొయినుద్దీన్,తానేశ్, యాదగిరి, ఈశ్వరయ్య, సైదులు, మాసయ్య, చెన్నయ్య, వెంకటేశ్, నాగేశ్, మహేశ్ పాల్గొన్నారు.



క్యాద్గీరా శివారులో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

పంట నష్టాన్ని పట్టించుకోరా?

బషీరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో కాగ్నానది వరద నీటి ముంపునకు గురై పత్తి, కంది పంటలు పాడైపోయాయి. రోజుల తరబడి నీటిలో పంట మునిగి కుళ్లిపోతున్నా వ్యవసాయాధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటంలేదని మండలంలోని క్యాద్గీరా రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. గ్రామ శివారులోని కాగ్నానది ఉప్పొంగి ప్రవహించడంతో 20 ఎకరాలకు పైగా పలు పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. వారం రోజులు గడుస్తున్నా ఆ శాఖ అధికారులు తమ గ్రామానికి రాలేదని వాపోయారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు స్పందించి పంటనష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం పరిహారం అందించేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నవీన్‌రెడ్డి

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి

మేడ్చల్ టౌన్, సెప్టెబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాలకు అనుగుణంగా మేడ్చల్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర బేవరేజెస్ త్రిసభ్యకమిటీ సభ్యుడు నవీన్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులోని వికర్ సెక్షన్, అర్చన కాలనీల్లో సీసీరోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. కిష్టాపూర్‌లోని వికర్‌సెక్షన్ కాలనీ, అర్చన కాలనీలతో పాటు వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇతర కాలనీల్లో రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లో సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీ లైన్ల ఏర్పాటుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కాంగ్రెస్ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



పంచాయతీలో సమావేశమైన యూపీ అధికారులు, సర్పంచులు

అభివృద్ధి పనులు భేష్

● మాల్‌లో పర్యటించిన ఉత్తర్‌ప్రదేశ్ అధికారులు, సర్పంచ్‌లు

యాచారం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్‌లో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 21 మంది సర్పంచ్‌లు, 9 మంది అధికారులు సోమవారం పర్యటించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామానికి కేంద్ర ప్రభుత్వ ఆత్మ నిర్భర్ పంచాయతీ అవార్డు వచ్చింది. పశువుల సంత ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందని ఎంపీడీవో రాధారాణి, ఎంపీవో శ్రీలత వారికి వివరించారు. నర్సరీ, శ్మశాన వాటిక తదితర పనులను పరిశీలించారు. వసూలయ్యే పన్నులను గ్రామాభివృద్ధికి ఖర్చుచేయడం బాగుందన్నారు. యూజీడీ, సీసీ రోడ్లు బాగున్నాయని సర్పంచ్‌లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు స్మిత, అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వైవీ రాజు ఉన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

» ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్



మాట్లాడుతున్న వేణుగోపాల్

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పెన్షన్ విద్రోహ దినాన్ని పాటిస్తూ కలెక్టరేట్ వద్ద ఉదయం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి పాత పెన్షన్ తొలగించడం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వాలు కాలరాశాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెండు లక్షల పైబడి ఉద్యోగులు ఐక్యతను చాటుతూ నిరసనలో పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ విరమణ తర్వాత భద్రతగా నిలిచే పెన్షన్ లేకపోవడం తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షఫి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న వైర్లను తొలగించాలి



ఏఈ ప్రదీప్‌కు వినతిపత్రం ఇస్తున్న నరేష్‌కుమార్

శంకర్‌పల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా ఉన్న పాత విద్యుత్ వైర్లను తొలగించి కొత్త వాటిని బిగించాలని శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఏఈ ప్రదీప్‌కు, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్‌లకు సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ఇండ్లకు, వీధిదీపాలకు విద్యుత్ సరఫరా చేసే వైర్లు ప్రమాదకరంగా మారాయన్నారు. పాత వైర్లు తరచూ తెగుతున్నాయని తెలిపారు. లోఓల్టేజీ సమస్య తీర్చేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రవీందర్ యాదవ్, మహేందర్‌రెడ్డి, వైభవ్ ఉన్నారు.

బాల్‌రాజ్ కుటుంబానికి న్యాయం చేయాలి

ముగిసిన అంత్యక్రియలు



దండుమైలారంలో ఆందోళన చేస్తున్న బాల్‌రాజ్ కుటుంబీకులు, బంధువులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దండుమైలారంలో పొలం వివాదంలో దాయాదుల దాడిలో చనిపోయిన గుడేటి బాల్‌రాజ్ కుటుంబానికి న్యాయం చేయాలని సోమవారం గ్రామంలో అతడి కుటుంబ సభ్యులు, బంధువులు బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్‌రెడ్డిలు పరిస్థితిని అదుపు చేశారు. బాల్‌రాజ్‌కు భార్య పావని, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. దాడిలో పావని సైతం తీవ్రంగా గాయపడింది. అదే సమయంలో రెండు వర్గాల తరపు పెద్దమనుషులు చర్చించి మృతుడి కుటుంబానికి రెండెకరాల పొలం ఇచ్చేందుకు ఒప్పదం కుదిర్చినట్టు తెలుస్తోంది. పోస్టుమార్టం అనంతరం సోమవారం సాయంత్రం బాల్‌రాజ్ మృతదేహాన్ని గ్రామానికి తెచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. గాయపడిన బాల్‌రాజ్ తమ్ముడు పర్వతాలు భార్య మంజులకు బైరామల్‌గూడ అవేర్ గ్లోబల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది. కాగా ఈ దాడులను పోత్సహించిన ఆదిబట్లకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడిపైనా కేసు నమోదు చేయాలని బాల్‌రాజ్ బంధువులు డిమాండ్ చేశారు. ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా గ్రామంలో పికెటింగ్ కొనసాగుతోంది.

కేబుళ్ల తొలగింపుతో ఇక్కట్లు

ఘట్‌కేసర్‌లో నిలిచిన ఇంటర్నెట్ సేవలు

» ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు అంతరాయం

» వర్క్‌ఫ్రమ్ హోం ఉద్యోగులకూ తీవ్ర అవస్థలు



ఎదులాబాద్ రోడ్డులో కేబుల్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఘట్‌కేసర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన అక్రమ ఇంటర్నెట్ కేబుళ్లను విద్యుత్ అధికారులు తొలగింపునకు శ్రీకారం చుట్టారు. దీంతో ఘట్‌కేసర్‌లో ఇంటర్నెట్ సేవలు స్తంభించాయి. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ రోడ్లకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలకు పెద్దఎత్తున ఇంటర్నెట్ కేబుళ్లను ఏర్పాటు చేశారు. ఇటీవల నగరంలో జరిగిన విద్యుత్ ప్రమాదం, వినాయక విగ్రహాల తరలింపు, నిమజ్జనాల తరలింపును దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఘట్‌కేసర్‌లోని ఒక్క ఎదులాబాద్ రోడ్డులోనే భారీగా కేబుల్ వైర్లను కత్తిరించి రోడ్లపక్కన పడేశారు. అనంతరం తొలగించిన కేబుల్ వైర్లను డీసీఎం వాహనంలో వేసి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తరలించారు. అనేక సంవత్సరాలుగా కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ స్తంభాలకు పెద్దఎత్తున వివిధ రకాల కేబుళ్లను ఏర్పాటు చేశారు. కొన్ని సందర్భాల్లో విత్యుత్ తీగలు సరిచేయడానికి సైతం ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్ రోడ్డులో విద్యుత్ అధికారులు చేపట్టిన కేబుల్ వైర్ల తొలగింపుతో ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయాయి. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ముందుకు సాగక జనాలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వినియోగ దారులనుంచి పెద్దఎత్తు తన ఫిర్యాదులు వస్తుండంటంతో కేబుల్ ఆపరేటర్లు ముసురు వర్షంలోనూ కొత్తకేబుళ్లను ఏర్పాటుచేసి ఇంటర్నెట్‌ను పునరుద్ధరించే పనుల్లో నిమగ్నమయ్యారు. పెద్దఎత్తున కేబుల్ వైర్లు తొలగించడంతో ఇంటర్నెట్ సేవలు ప్రారంభం కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందో తెలయని అయోమయ పరిస్థితి నెలకొన్నది.

వర్క్‌ఫ్రమ్ హోం ఇబ్బందికరంగా మారింది



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని మారుతినగర్, శ్రీనిధి కాలనీతోపాటు కాలనీలో వారం రోజులుగా ఇంటర్నెట్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్క్‌ప్రంహోం చేయడానికి ఇబ్బంది పడాల్సివస్తుంది. ఈవిషయమై ఇంటర్నెట్ సంస్థ నిర్వాహకులను అడిగితే సమాధానం చెప్పడంలేదు.

- ఎంబీఆర్ రాజు, ప్రైవేట్ ఉద్యోగి, ఘట్‌కేసర్

మూడు రోజులుగా నెట్ రావడంలేదు



ఘట్‌కేసర్‌లో గత మూడురోజులుగా ఇంటర్నెట్ రావడంలేదు. దీంతో ఎలాంటిపని చేయలేకపోతున్నాం. ప్రస్తుతం అన్ని సేవలు ఇంటర్నెట్‌పై ఆధారపడి ఉన్నాయి. జనాలు వచ్చి వెనుదిరిగి వెళ్తున్నారు. అసలే అంతంత మాత్రంగా సాగుతున్న వ్యాపారాలపై నెట్‌సేవలు నిలిచిపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

- వాకిటి ప్రవీణ్‌రెడ్డి, ఇంటర్నెట్ దుకాణదారుడు, ఘట్‌కేసర్



పనిచేయని వెదర్ రిపోర్ట్ డిస్‌ప్లే

వికారాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో అందరికి కనిపించేలా ఏర్పాటు చేసిన వెదర్ రిపోర్ట్ (వాతావరణ సమాచారం) డిస్‌ప్లే గత కొన్ని రోజులుగా పని చేయడం లేదు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు, వర్షపాతం వివరాలు తెలియజేసే ఈ డిజిటల్ బోర్డు మొక్కుబడిగా మారడం కలెక్టరేట్‌లో చర్చనీయాంశంగా మారింది.

కల్వర్టుపై గుంతల పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కల్వర్టుపై గుంతలను పూడ్చివేయించిన అధికారులు

దుద్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'గుంతలతో ఇబ్బందులు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని హకీంపేట్ గ్రామ శివారులో కోస్గి పట్టణానికి వెళ్లే మార్గంలో కల్వర్టుపై గుంతలు ఏర్పడి వాహనదారులు ఎదుర్కొంటున్నారు. స్పందించిన అధికారులు కల్వర్టుపై ఏర్పడిన గుంతలను కంకర, డస్టుతో సోమవారం పూడ్చివేయించారు.

రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు



చిన్న ఎల్కిచర్లకు ఆర్టీసీ సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, కొందుర్గు,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న షాద్‌నగర్-లాల్‌పహాడ్ చౌరస్తా ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు మరమ్మతులకు రూ.60లక్షలు మంజూరైనట్లు కొందుర్గు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కొందుర్గులో రోడ్డు పనులను ఆర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే శ్రీరంగాపూర్-చిన్న ఎల్కిచర్ల రూట్ ఆర్టీసీ సర్వీసును షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తం రెడ్డి, కృష్ణయ్య, మంగులాల్‌నాయక్, రాములుగౌడ్, వేణుగోపాల్, రవి, విక్రం, కాంట్రాక్టర్ షాబాజ్, పంచాయతీ కార్యదర్శి సురేఖ పాల్గొన్నారు.

బాబు బాగుండాలని బక్కని పూజలు



పూజలు చేస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయురారోగ్యాలతో ఉండాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు కోరారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పదవీ బాధ్యతలు చేపట్టి 30సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని రామేశ్వరాలయంలో రామలింగేశ్వరుడికి అభిషేకపూజలు చేశారు. చంద్రబాబునాయుడు నిండునూరేళ్ల ప్రజా జీవితంలో కొనసాగాలని నర్సింహులు ప్రార్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంధం ఆనంద్, కుమార్, ఎ.లక్ష్మయ్య, కె.అంజయ్య, భూపతిరెడ్డి, ఎస్.వెంకటయ్య, రాజ్ పాల్గొన్నారు.

అసైన్డ్ రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లో అసైన్డ్ పట్టాలు పొందిన రైతుల పేర్లను భూ భారతి పోర్టల్‌లో నమోదుచేసి పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో రైతులు సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ.. అనాజ్‌పూర్‌లో సర్వే నంబర్లు 274, 275, 277, 278, 281లలో 125ఎకరాల్లో 1991లో 125మంది పేదలకు ఎకరా చొప్పున పంచారని గుర్తుచేశారు. 80మందికి పాసు పుస్తకాలిచ్చారని, ధరణిలో రైతుల పేర్లను తొలగించారని వాపోయారు. అప్పటి నుంచి రైతులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. ఆందోళనలో సీపీఎం నాయకులు సామేల్, జంగయ్య, సుమలత, శివకుమార్, ముత్యాలు, బాల్‌రాజ్, రైతులు పాల్గొన్నారు.

టీచర్ల డిప్యూటేషన్‌ను రద్దు చేయండి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

యాచారం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ స్కూల్ టీచర్లను ఇతర ప్రాంతాలకు డిప్యూట్ చేయొద్దని, డిప్యూటేషన్లను రద్దు చేయాలని కోరుతూ సోమవారం మేడిపల్లి మాజీసర్పంచ్ బోడ కృష్ణ, పీఆర్‌జీ గ్రూప్ చైర్మన్ పి.రవీందర్‌గుప్తా తదితరులు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఉపాధ్యాయులు లేక బోధన జరగక విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. రెండు రోజుల్లో డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరారు. విద్యార్థులకు న్యాయం చేయకుంటే యాచారం, కలెక్టరేట్‌ల వద్ద ధర్నా చేస్తామన్నారు. కాగా మీకు న్యాయం చేసి ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నరేష్, శ్రీశైలం, శ్రీను., ఖాదర్, నాగరాజు తదితరులున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దు

ఆదిభట్ల : ఇబ్రహీంపట్నం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెట్టు దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డికి టీడీపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం సమీకృత సబ్‌రిస్ట్రార్ కార్యాలయాల పేరిట పట్నం రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంకాల్‌కు తరలించాలని తలపెట్టిందని కలెక్టర్‌కు తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడి నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలిస్తే మంచాల, యాచారం, మాల్, లోయపల్లి తదితర మండలాల ప్రజలాకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రభుత్వం నిర్ణయంపై పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో జె.రవీందర్, రంగారెడ్డి, రాంరెడ్డి, వీరేశం, లతీఫ్, హర్షవర్ధన్, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, బుచ్చయ్య పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

» వృద్ధురాలిని కుటుంబీకులకు అప్పగింత

తలకొండపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పోలీసులు మానవత్వాన్ని చాటారు. ఓ వృద్ధురాలిని చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తలకొండపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. తలకొండపల్లిలోని ఏపీజీవీబీ బ్యాంక్ వద్ద ఓ వృద్ధురాలు మానసిక స్థితి సరిగాలేక పడిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సిబ్బందిని అక్కడికి పంపారు. కానిస్టేబుల్ నిరంజన్ వృద్ధురాలి ఆధార్ కార్డు ఆధారంగా ఆమె మిడ్జిల్‌కు చెందిన మారెమ్మగా గుర్తించారు. వెంటనే ఆమెను ఇంటికి తీసుకుపోయి అప్పగించారు.



వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసు

సీపీఎస్ రద్దుకు ఉద్యోగ సంఘాల నిరసన



మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

మేడ్చల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు ఉరితాడుగా మారిందన్నారు. ఇప్పటికైనా వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసేంతవరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

మాడ్గులకు 115 ఇందిరమ్మ ఇళ్లు

ఆమనగల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మాడ్గుల గ్రామానికి 115 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు టీపీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా అదనంగా ఇళ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. మంగళవారం మాడ్గుల రైతు ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు హాజరై జయప్రదం చేయాలని రాంరెడ్డి కోరారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలం చూపాలి

కందుకూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నేదునూరులో ప్రభుత్వం పేదలకిచ్చిన ఇళ్ల పట్టాలకు పొజిషన్ చూపాలని సీపీఎం మండల నాయకుడు ఎ.కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ గ్రామ అధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో పేదలకు కేటాయించిన భూమిని పరిశీలించారు. సర్వే నంబర్‌19లో 155 మంది పేదలకు 60గజాల చొప్పున ఇచ్చారని తెలిపారు. ఇప్పటి వరకు పొజిషన్ చూపలేదని, ఇందిరమ్మ ఇల్లు కట్టుకుందామన్నా స్థలం లేక నిర్మించుకోలేకపోతున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా స్థలాన్ని చూపాలని, లేకుంటే పేదలతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేదునూరు మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, కె.రాములు, చెన్నయ్య, రాములు, మైసయ్య, ఎ.వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

చేవెళ్ల, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): న్యాలటలో సర్వే నంబర్ 240లో ఉన్న 7ఎకరాల ప్రభుత్వ భూమిని ఇండ్లు లేని పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ నాయకులతో తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం ఇచ్చారు. న్యాలటలో 7ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంత కాకముందే పేదలకు పంచితే ప్రయోజనం ఉంటుందన్నారు. ఇప్పటికే ఈ జాగలో ఇళ్ల పట్టాలిచ్చారని గుర్తుచేశారు. న్యాలట, సింగప్పగూడ, రామన్నగూడల్లో ఇండ్లు లేని పేదలున్నారని, అధికారులు పరిశీలించి ఇళ్ల పట్టాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు మక్బూల్, పాపయ్య, కృష్ణగౌడ్, శివ, మల్లేశ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపై కోర్టు స్టే తెచ్చుకున్న సొసైటీ కార్యదర్శులు

ఇబ్రహీంపట్నం/యాచారం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ సొసైటీ కార్యదర్శులను ఇటీవల డీసీసీబీ అధికారులు బదిలీ చేశారు. బదిలీలను నిలిపేయాలని ఉప్పరిగూడ, పోల్కంపల్లి, రాయ్‌దుర్గా, దూలపల్లి, శంకర్‌పల్లి, మోకిల, రాచకొండమైలారం, మంచాల, యాచారం, హయత్‌నగర్, తుర్కయంజాల్, బండ్లగూడ కార్యదర్శులు కోర్టుకు వెళ్లగా బదిలీలపై గత నెల 28న స్టే విధించింది. స్టే ఉత్తర్వులు సోమవారం కార్యదర్శులకందాయి. 25559ఆర్డర్ ప్రకారంగా ఉత్తర్వులు జారీచేసింది. సొసైటీ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించడంతో తదుపరి ఉత్తర్వులు అందే వరకు బదిలీ చేయొద్దని కోర్టు బదిలీలను నిలిపివేసింది.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్నాకు ఉపాధ్యాయులు వెళ్లారు. షాద్‌నగర్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీపీఎస్‌ను ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. 2004లో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం సెప్టెంబర్ 1న సీపీఎస్‌ను వర్తింపజేస్తూ జీవో 653 జారీచేశారని గుర్తుచేశారు. ఈ నిర్ణయంతో 20 ఏళ్లుగా లక్షలాది మంది ఉద్యోగులు పెన్షన్‌కు దూరమయ్యారని తెలిపారు. ధర్నాకు తరలిన వారిలో టీచర్లు బీపీఎం రాజు, సురేష్‌సింగ్, బాల్‌రాజ్‌గౌడ్, వెంకటేష్, శాంతాబాయ్, అనురాధ, గౌరీశ్వరి, శైలజ, చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్ రూరల్: హైదరాబాద్ ధర్నాకు బయలుదేరుతున్న ఉపాధ్యాయులు



కొత్తూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఆమనగల్లు: ఆమనగల్లులోని జెడ్పీ బాలుర పాఠశాలలో సీపీఎస్‌కు వ్యతిరేకంగా భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. కాలేజీ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో రంగారెడ్డి జిల్లా సభ్యుడు శేఖర్, నాయకులు జైపాల్, వెంకటయ్య, కృష్ణ, నాగమణి, పర్వతాలు, రవి, విష్ణు, అలివేలు, చైతన్య, చంద్రశేఖర్, మెర్సి, కృష్ణయ్య, సాల్మన్‌రాజ్, కుసుమలత, బాలరాజు, మధుకర్, ఆచారి, సునీత, సుశీలమ్మ, వేణు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. హెచ్‌ఎం అంగోర్‌నాయక్ మాట్లాడుతూ.. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. టీచర్లు రవికుమార్, శిరీష, నవనీత పాల్గొన్నారు.

యాచారం: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో పాఠశాలల బయట ఆందోళన చేశారు. సీపీఎస్‌తో తమకు భద్రత కరువైందని ఆందోళన చెందారు. పాతపెన్షన్ విధానం అమలు చేయకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని ఈ సందర్భంగా ఉద్యోగులు అన్నారు.



యాచారం: కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



ఆమనగల్లులో నిరసన తెలుసుతున్న టీచర్లు

ఓటరు తుది జాబితాలో తప్పులుండొద్దు

(ఐదో పేజీ తరువాయి)

ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 53 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్వో సంగీత, అధికారులు పాల్గొన్నారు.

కాలయాపన చేయొద్దు : గోరెంకల నర్సింహ

టెండర్ల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే చేప విత్తనాలను పంపిణీ చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు గోరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. చేప పిల్లల పంపిణీకి బదులుగా మత్స్య సొసైటీల అకౌంట్లో నగదు జమచేయాలని కోరారు. ఇబ్రహీంపట్నంలో కూల్చేసిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పునర్నిర్మించాలని కోరారు. కోహెడలో నిర్మించే అధునాతన చేపల మార్కెట్ కోసం అదనంగా మూడు ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. టీఎంకేఎంకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పూలగాజుల జంగయ్య, బొద్రమోని నర్సింహ, రాములు, లలిత, అనురాధ, క్రిష్ణమూర్తి, మెంగ సైదులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం నాయకులు

సార్.. ఏడు నెలలుగా జీతాల్లేవ్!

ఏడు నెలలుగా జీతాలు రావడం లేదని, తామెలా బతకాలంటూ మోడల్ స్కూల్ బోధన, బోధనేతర సిబ్బంది కలెక్టర్ నారాయణరెడ్డితో ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పిల్లల ఫీజులు కట్టుకోవాల్సి వస్తుందని, జీతాలు వచ్చేలా చూడాలని కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని జిల్లా జేఏసీ కన్వీనర్ డాక్టర్ రామారావు డిమాండ్ చేశారు. జిల్లా ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద పెన్షన్ విద్రోహదినాన్ని పాటించారు. ఈ కార్యక్రమంలో శ్రీనేష్ కుమార్ నోరి, వెంకటేష్, గోపాల్ నాయక్, ఇస్మాయిల్, కుశాల్ జమ, నాగార్జున రావు, వెంకటప్ప, రాకేష్, రంగయ్య, శాంతి శ్రీ, మహేష్, సైదమ్మ, అలివేలు, ఫైలట్ పాల్గొన్నారు.

టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో..

టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము లోకేశ్వర్, ప్రధాన కార్యదర్శి జామ కుశాల్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంఖాల్‌కు తరలించొద్దు

ఇబ్రహీంపట్నంలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంఖాల్ గ్రామానికి తరలించొద్దని ఇబ్రహీంపట్నంకు చెందిన టీడీపీ నాయకులు దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి రవీందర్, రాంరెడ్డి, రావుల వీరేశం, అబ్దుల్ లతీఫ్, హర్షవర్ధన్, వెంకట్‌రెడ్డి, బుచ్చయ్య, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ గొడవలతో వ్యక్తి ఆత్మహత్య



కృష్ణయ్య(ఫైల్)

తలకొండపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అంతారంలో సోమవారం జరిగింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. అంతారానికి చెందిన కావలి కృష్ణయ్య(35)కు 12ఏళ్ల క్రితం విజయతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడున్నాడు. కొన్నేళ్లుగా కృష్ణయ్యకు భార్యతో గొడవలవుతున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా అతడిలో మార్పు రాలేదు. సోమవారం సైతం గొడవపడ్డాడు. విజయ కూలి పనులకు వెళ్లగా ఇంట్లో ఉరేసుకున్నాడు. కృష్ణయ్య సోదరుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఎద్దు మృతి

చేవెళ్ల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా ఎద్దు మృతి చెందిన సంఘటన ఆలూర్‌లో చోటుచేసుకుంది. రైతు పాండు తెలిపిన వివరాల ప్రకారం.. పాండు తన ఎడ్లను ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం పొలం వద్ద ఉన్న కొట్టంలో కట్టేసొచ్చాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా ఒక ఎద్దు చనిపోయింది. దీంతో రైతు విలపించారు. ప్రభుత్వం తనకు సాయం అందించాలని రైతు కోరాడు.

మట్టి తరలిస్తున్న వాహనాల స్వాధీనం

యాచారం., సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి):కిషన్‌పల్లిలో అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కవేటర్లను సోమవారం పోలీసులు సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించారు. గ్రామంలో ప్రభుత్వం నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారమొచ్చింది. మట్టి తరలింపు అనుమతులు లేవని కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

యూరియా కోసం కన్నెర్ర



యూరియా కోసం యాచారం సొసైటీ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

(ఐదో పేజీ తరువాయి)

రైతులకు సరిపడా యూరియాను అందిస్తామని జిల్లా అధికారి హామీ ఇచ్చినట్లు ఆమె రైతులకు తెలిపారు.

ఒక్కొక్కరికి రెండు బస్తాలే..

కొందుర్గు/చౌదరిగూడ: ఉమ్మడి కొందుర్గు మండలంలో సింగిల్ విండో కార్యాలయంలో వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున 450యూరియా బస్తాలను పంపిణీ చేశారు.

యాచారం సొసైటీ ఎదుట ధర్నా

యాచారం: రాష్ట్ర ప్రభుత్వం సరిపడా యూరియా అందజేయడం లేదని యాచారంలోని సొసైటీ వద్ద రైతులు ధర్నా చేశారు. రెండు రోజులకు యూ రియా వస్తుందని సొసైటీ అధికారులు, ఏవో రవినాథ్ తెలపడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై రాస్తారోకోకు సిద్ధమవ్వుతుండగా అధికారులు సముదాయించారు. నానో యూరియాపై ఏవో రైతులకు అవగాహన కల్పించారు.

చేవెళ్లలో రైతుల బారులు

చేవెళ్ల: చేవెళ్లలోని ప్యాక్స్ వద్ద రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు బారులు తీరారు. చేవెళ్ల సొసైటీకి 450యూరియా బస్తాలు వచ్చాయని ఏవో శంకర్‌లాల్, సీఈవో వెంకటయ్య తెలిపారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందించారు. మరో రెండు రోజుల్లో 20టన్నుల యూరియా వస్తుందని అధికారులు తెలిపారు.

షాబాద్ మండలంలో..

షాబాద్: మండలంలో యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. మండలానికి 450బస్తాల యూరియా వచ్చింది. షాబాద్‌లో పీఏసీఎస్ కార్యాలయం వద్దకు ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున ఇచ్చారు.

గంటల తరబడి నిరీక్షణ

షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్ సొసైటీ వద్ద రైతులు నిరీక్షించారు. పోలీస్ బందోబస్తు మధ్య యూరియాను పంపిణీ చేశారు. దొరకని వారు నిరాశతో వెనుదిరిగారు. నిత్యం వస్తున్న 500 బస్తాల యూరియా సరిపోవడంలేదని, ఈ నెల 8వరకు టోకెన్లు రాసిచ్చామని ఏవో నిశాంత్‌కుమార్ తెలిపారు.

గణపయ్యకు ఘన పూజలు.. నిమజ్జనాలు

వినాయక చవితిని పురస్కరించుకొని గత నెల 27వ తేదీన మండపాల్లో కొలువైన వినాయక ప్రతిమలు ఘన పూజలందుకుంటున్నాయి. భక్తులు నిత్య పూజలు చేస్తూ ప్రజలకు ప్రసాదాన్ని పంచుతున్నారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి సోమవారానికి ఆరు రోజులు పూర్తికావడంతో వినాయకులను నిమజ్జనాలకు తరలిస్తున్నారు. - నెట్‌వర్క్



చేవెళ్లలోని న్యూ జర్నలిస్టు కాలనీ వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య



కందుకూరు: తుమ్మలూరు పరిధి మ్యాక్ బైఎంట్రీ ప్రాజెక్టు గణేశుడి లడ్డూను వేలంలో 4.68లక్షలకు కైవసం చేసుకున్న మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి



ఆమనగల్లు: పూజల్లో ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి



షాబాద్: తిర్మలాపూర్‌లో సుభాష్‌రెడ్డి, గ్రామస్థుల పూజలు



ఆమనగల్లు: గంగమ్మ ఒడికి చేరుతున్న పార్వతీ తనయుడు



కొత్తూర్: కొడిచర్ల తండాలో వినాయక మండపం వద్ద అన్నదానం చేస్తున్న మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



శంషాబాద్: వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న విద్యార్థులు



కడ్తాల: వినాయకుడి లడ్డూను దక్కించుకున్న శ్రీనివాస్‌రెడ్డి



చౌదరిగూడలో వినాయకుడి పూజలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు



ఆమనగల్లులో గణేశ్ నిమజ్జన వేడుకల్లో న్యాయవాదులు

చుక్కనీరు రాలే..!

(ఐదో పేజీ తరువాయి)

చెరువులు, కుంటల్లో నీరు చేరక ఎడారిని తలపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో రైతులు వర్షాధారంపైనే సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుత వర్షాలకు మెట్ట పంటలకు కొంత మేలు జరిగిందని చెబుతున్నారు.

డేంజర్‌లో తట్టిఖానా చెక్‌డ్యాం

చెరుదు మదురు వర్షాలకు ఇబ్రహీంపట్నం సమీప తట్టిఖానా చెక్‌డ్యాం నిండి అలుగు పారుతోంది. 2020లో వచ్చిన వరదలకు ఈ చెక్‌డ్యాం రైట్ ప్లాం(అబెట్‌మెంట్)కు గండిపడి ఖాళీ అయ్యింది. అప్పట్లో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఫ్లడ్‌వాల్ నిర్మాణానికి రూ.34లక్షలతో ప్రతిపాదనలు పంపారు. నిధులు రాక ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. కొండల మధ్య ఉన్న ఈ చెక్‌డ్యాంలో ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున నీరు నిలిచి భూగర్భ జలాలు పెరిగాయి. బోర్లు నీరు పోస్తున్నాయి. ఈ చెక్ డ్యాం అలుగు పారి రామోజీ ఫిలిం సిటీలోని ఇందిరాసాగర్‌లోకి నీరు చేరుతోంది.

ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు

ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని 684 చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలబోతున్నాయి. నీటి లభ్యత లేక చెరువుల కింద 15,345 ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. ఇంత దారుణ పరిస్థితి రాలేదని రైతులు వాపోతున్నారు. చెరువుల్లో నీరులేక మత్స్యకారులు జీవనోపాధి లేకుండా పోయింది.

బోర్లు ఎండిపోతున్నాయి



చెరువులు, కుంటల్లోకి నీరు రాక బోర్లలోనూ నీరుతగ్గింది. మరో మూడు నెలల్లో బోర్లు ఎండిపోయే ప్రమాదముంది. పంటలకు ఇబ్బంది కలిగే పరిస్థితులు ఉన్నాయి. బోర్లు ఎండితే మాకు అప్పులే మిగులుతాయి. పంటలకు సాగు నీరందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పి.బాషా, రైతు, మేడిపల్లి

చెక్‌డ్యాం మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం



తట్టిఖానా చెక్‌డ్యాం మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. గతంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం. నిధులు విడుదలైతే వెంటనే రైట్‌ప్లాం నిర్మాణం చేపడతాం. ఈసారి ఈ ప్రాంతంలో భారీగా వర్షాలు కురవని కారణంగా చెరువులు, కుంటల్లోకి నీరు రాలేదు. చెక్ డ్యాంల్లోకి నీరు వచ్చి చేరుతోంది.

- హరిత, ఇబ్రహీంపట్నం నీటిపారుదల శాఖ ఏఈ

యోగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింహా గౌడ్



కొత్తూర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా తిమ్మాపూర్‌నకు చెందిన, బీజేపీ సీనియర్ నాయకుడు అమడపురం నర్సింహాగౌడ్ ఎన్నికయ్యారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నర్సింహాగౌడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు యోగా చేస్తూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. ప్రతి వ్యక్తికి యోగా ప్రాముఖ్యతపై తెలియజేసేలా కృషిచేస్తానన్నారు. తన ఎన్నికకు కృషిచేసిన జిల్లా యోగా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మనోహర్, ఒలింపిక్ రాష్ట్ర అసోసియేషన్ సభ్యుడు బాలరాజ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తంగా...

● **కందుకూరు:** మండల కేంద్రంలో ఈ నెల 8న నిర్వహించే ఫించన్‌దారుల సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి ఎం.యాదగిరి, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు కోరారు. సోమవారం బాచుపల్లిలో వృద్ధులు, ఫించన్‌దారులతో సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఇప్పుడిస్తున్న పింఛన్లకు అదనంగా రూ.2వేలు పెంచుతామని హామీ ఇచ్చి నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జి.జంగయ్య, ఎం.క్రిష్ణ, యాచారం పాండు, జి.వెంకటేషం పాల్గొన్నారు.

● **షాద్‌నగర్ రూరల్:** ఫరూఖ్‌నగర్ మండలంలోని రైతులు మంగళవారం యూరియా కోసం రావద్దని ఏవో నిషాంత్‌కుమార్ తెలిపారు. అనివార్య కారణాల వల్ల యూరియా రావడం లేదన్నారు. వచ్చే యూరియా టోకెన్లిచ్చిన వారికే ఇస్తామని, రైతులు సహకరించాలని కోరారు.

● **శంకర్‌పల్లి:** ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెరగడానికి దోహదపడతాయని ఎంఈవో అక్బర్ తెలిపారు. మహాలింగపురం, గాజులగూడ, మసానిగూడ, జన్వాడ, అంతప్పగూడ గ్రామాల్లో ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించారు. పిల్లల సంపూర్ణ వికాసానికి పూర్వప్రాథమిక విద్య పునాది వేస్తుందన్నారు. 3 సంవత్సరాలు పైబడిన పిల్లలను ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, చంద్రయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

● **మాడ్గుల:** ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్ కింద మాడ్గులలో ప్రాథమిక పాఠశాల ఎంపికైనట్టు ఎంఈవో సర్దార్‌నాయక్ తెలిపారు. ఇందులో బోధించేందుకు ఇంటర్ పాసైన గ్రామస్తులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆయా కోసం 7వ తరగతి పాసై ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కోరారు. దరఖాస్తులను ఎమ్మార్సీలోలో అందచేయాలని సూచించారు.

● **తలకొండపల్లి:** గొర్రెల కాపరిని చితకబాదిన ఫారెస్ట్ అధికారిపై చర్యలు తీసుకోవాలని యాదవ సంఘం నాయకులు, వివిధ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తలకొండపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తలకొండపల్లి-చీపునుంతల శివారులో రెండు రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన కటికెల నారాయణ అనే వృద్ధుడు గొర్రెలు మేపడానికి వెళ్లాడు. కొన్ని గొర్రెలు అడవిలోకి వెళ్లిన సమయంలో బీట్ ఆఫీసర్ అబ్దుల్ అజీజ్ వృద్ధుడిని చితకబాదాడు. దీంతో నారాయణ అనారోగ్యానికి గురికావడంతో విషయం వెలుగులోకొచ్చింది. దాడిచేసిన అటవీ అధికారిపై చర్యలు తీసుకోవాలని యాదవ సంఘం నాయకులు బాధితుడితో కలిసి ఎస్‌ఐ శేఖర్‌కు ఫిర్యాదు చేశారు. వారిలో నాయకులు రవీందర్‌యాదవ్, శేఖర్‌యాదవ్, జంగయ్య, పాండు, మల్లేశ్, రాజు, చెన్నయ్య, యాదవ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

● **కొత్తూర్:** ఇటీవలి వర్షాలకు కొత్తూర్ మండలంలో పంట నష్టం జరగలేదని ఏవో గోపాల్ తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వేసిన పంటలను ఆయన పరిశీలించారు. మండలంలో వరి, పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలను వేలాది ఎకరాల్లో సాగు చేశారని పేర్కొన్నారు. పంటల ఎదుగదల బాగుందని, భారీగా దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. పత్తిపై రసం పీల్చే పురుగుల నివారణకు ఫైరీప్రాక్సిఫాస్‌తో పాటు డైపేంతురాన్ ఒక లీటర్ నీటికి 2ఎంఎల్ కలిపి పిచికారి చేయాలని అధికారి గోపాల్ రైతులకు సూచించారు.

● **కొందుర్గు:** ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న నాయకులను అరెస్టు చేయడం సరి కాదని సీపీఐ మండల కార్యదర్శి నర్సింహ అన్నారు. ఆయనను పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టకున్నా పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

● **షాబాద్:** ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లిలో ఏఐజీ ఆసుపత్రి సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులు ముందుకు రావాలన్నారు. ఉచితంగా వైద్య సేవలందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వేణుగోపాల్, శ్రీనివాస్, రాంచంద్రయ్య, ప్రవీణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● **మాడ్గుల:** ఆర్కపల్లిలో బండ ఆగమ్మ ఇటీవల అనారోగ్యంతో చనిపోయింది. సోమవారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు భట్టు కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆగమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. మాజీ సర్పంచ్ జంగయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కల్లు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **యాచారం:** గ్రామాల్లో వైద్యసేవలందిస్తున్న పది మంది ఆశా వర్కర్లను సోమవారం యాచారం, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. వారు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని తలపెట్టారు. వారు హైదరాబాద్ తరలకుండా పోలీసులు అరెస్టు చేశారు. ఇండ్లలోకి పోలీసులు వచ్చి అరెస్టు చేయడం ఏమిటని ఆశాలు ప్రశ్నించారు. తమ వేతనాలు పెంచి ఆదుకుంటామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలుపుకోవాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.